తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





# ముఖ్యమంత్రి రాక సందర్భంగా ముందస్తు భద్రతా సమీక్ష



రేణిగుంట, డిసెంబరు 6 ప్రభాతవార్త:
రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 7వ తేదీ వస్తున్నసందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం మంగళవారం రేణిగుంట విమానాశ్రయంలో ముందస్తు భద్రత తదితర అంశాలపై సమీక్షించారు. ఈ క్రమంలో భద్రత దృష్ట్యా అడ్వాన్స్ సెక్యూరిటీ లైసెనింగ్ నిర్వహించి సంబంధిత అదికారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి పలు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ వైద్యశాఖ స్పెషలిస్ట్ డాక్టర్ల ఏర్పాటు, అంబులెన్స్, సేఫ్ రూమ్, ఫైర్ అధికారులు ఫైర్ సేఫ్టీ చర్యలు, ఫుడ్ సేఫ్టీ తదితర శాఖలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ బందోబస్తు అంశాలపై పోలీసులకు సూచనలు చేశారు. శ్రీకాళహస్తి ఆర్డీవో రామారావు, ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజ్‌కిషోర్, సీఎస్‌వో రాజశేఖర్‌రెడ్డి, డిప్యూటీ కమాండెంట్ అంకిత అగర్వాల్, డీఎంహెచ్‌వో శ్రీహరి, జిల్లా ఫైర్ అధికారి రమణయ్య, డీఎస్పీలు సురేంద్ర, నందకిషోర్, ఇన్‌స్పెక్టర్ రెడ్డెప్పరెడ్డి, రేణిగుంట తహసీల్దార్ శివప్రసాద్ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.



## కన్నుల పండువగా

# జ్వాలాతోరణం

### శివయ్యకు అగ్నితో అభిషేకం
### భారీ ఎత్తున హాజరైన భక్త జనం



శ్రీకాళహస్తి,డిసెంబర్ 6 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో మంగళవారంరాత్రి భక్తిశ్రద్ధలతో కన్నుల పండువగా జ్వాలా తోరణం కార్యక్రమాలను నిర్వహించారు.ప్రతిఏడాది ఆలయంలో చొక్కాణి ఉత్సవాన్ని నిర్వహించటం ఆనవాయితి.ఈ నేపథ్యంలో ఈ ఏడాది చొక్కాణి ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. తమిళనాడు సరిహద్దుల్లో ఉన్న శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొన్ని తమిళ సంప్రదాయాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. తిరుణ్ణావమలైలో పౌర్ణమి సందర్భంగా అగ్నితో అభిషేకించటం ఆనవాయితి.ఈ ఆనవాయితి శ్రీకాళహస్తీశ్వరాలయంలో కూడా తరాల నుంచి నిర్వహిస్తున్నారు. రెండేళ్ళుగా కోవిడ్ కారణంగా ఒక ఏడాది బురివి తుపానుతో మరో ఏడాది చొక్కాణి ఉత్సవాన్ని ఏకాంతంగా నిర్వహించారు. ఈ ఏడాది ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సారథ్యంలో బారీ ఎత్తున నిర్వహించారు.

### బాలదీపాల ఊరేగింపు:

శ్రీకాళహస్తీశ్వరాలయంలో చొక్కాణి సందర్భంగా ఆలయంలోని అమ్మవారి గర్భగుడి వద్ద సోమవారం రాత్రి వెలిగించిన బాల దీపాలను అర్చకులు నాట్యాలుచేస్తూ నంది విగ్రహం వద్దకు తెచ్చారు.సంప్రదాయబబద్దంగా వేద పండితులు వేద మంత్రాలను పఠిస్తుండగా అర్చకులు, ఆలయ పౌరోహితుల సారథ్యంలో చొక్కాణి చెట్టును తగులు బెట్టారు. శివయ్యను అగ్నితో పూజించే విధానాల్లో ఇదొకటి. అయితే చొక్కాణి ఉత్సవానికి స్థానిక భక్తులు విశేషసంఖ్యలో హాజరయ్యారు. తాటిచెట్టుకు తాటిమట్టలు కట్టి చివరన దీపం ఏర్పాటు చేసి తగుల బెట్టడం ఆనవాయితి.ఈ నేపథ్యంలో ఓ పరిచారకుడు దీపాన్ని చెట్టుపై ప్రతిష్టించారు. తరువాత తాటి మట్టలను కాల్చారు.ఈ తాటి మట్టల కోసం భక్తులుఎగబడ్డారు.దీనికితోసులాటలు చోటు చేసుకున్నాయి.చొక్కాణి ఉత్సవానికి ముఖ్యఅతిధిగా శారదపీఠం ఉత్తరాధికారి స్వాత్వానంద సరస్వతి స్వామి హాజరయ్యారు. ఆయన దీపారాధనలో పాల్గొనటంతో సాయంత్రం 7గంటలకు ప్రారంభం కావాల్సిన కార్యక్రమాలు 8గంటల తరువాత ప్రారంభించారు. భక్తులు ఇసుకేస్తేరాలనంత రద్దీచోటు చేసుకుంది. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఇఓ వికెసాగర్‌బాబు, ధర్మకర్తల మండలి ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు కొండూరు సునీత, లక్ష్మి, రమాప్రభ,పసలసుమతి, మహీధర్‌రెడ్డి, ప్రత్యేకాహ్వానితులు జూలుగంటి సుబ్బారావు, చింతామణిపాండు, పవన్‌లు పాల్గొనగా నంద మెడికల్స్ అధినేత నరసింహరాజు హాజరయ్యారు.





పవిత్రమైన కార్తీకమాసంలో కృత్తిక ఘడియల్లో మంగళవారం సాయంత్రం తిరుపతిలోని శైవక్షేత్రం కపిలేశ్వరస్వామి ఆలయంలో శివలింగం, శూలం ఆకృతిలో దీపాలు వెలిగించారు. కృత్తికాదీపోత్సవాలను ఆలయ అర్చకులు, టిటిడి ఛైర్మన్ సతీమణి స్వర్ణలతరెడ్డి, ఆలయ డిప్యూటీ ఇఓ దేవంద్రబాబు, ఏఇఓ పార్ధసారధి, సూపరింటెండెంట్ భూపతి కపిలేశ్వర ఆలయంలో ఆలయగోపురం, కామాక్షి అమ్మవారి ఆలయ గోపురం,ధ్వజస్తంభంపై దీపాలు వెలిగించారు. ప్రభాతవార్త, తిరుపతి,

# గజగజలాడిస్తున్న గజరాజులు

### రోడ్డుపై తిష్టవేసిన 22 ఏనుగులు

పలమనేరు,డిసెంబరు 6,ప్రభాతవార్త:
మండలంలోని ప్రజలను గజరాజులు గజగజలాడిస్తున్నాయి.గత కొద్ది రోజులుగా పదుల సంఖ్యలో ఏనుగులు గుంపులుగా జాతీయ రహదారిపై తిష్టవేసుకోవడంతో ఉదయం,రాత్రి సమయాలలో అటువైపు ప్రయాణించాలంటే ప్రజలు వణికిపోతున్నారు.మండలంలోని పలు ప్రాంతాలలో తరచూ ఏనుగుల గుంపు పంటలపై దాడి చేయడం తెలిసిందే.అయితే ప్రస్తుతం పంటపొలాలతో పాటు జాతీయ రహదారులను సైతం వాటి స్థావరాలుగా మార్చుకున్నాయి.పలమనేరు సమీపంలోని గుడియాత్తం, చిత్తూరు జాతీయ రహదారులపై గతంలో ఒకటి రెండు సంఖ్యలో సంచరిస్తుండగా ఏనుగులు ప్రస్తుతం పదుల సంఖ్యలో సంచరిస్తు ప్రయాణికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి.గతంలో మండల సమీపంలోని అటవీ ప్రాంతంలో సుమారు 20 ఏనుగులు ఉండగా ప్రస్తుతం కర్ణాటక,తమిళనాడు నుండి సుమారు 40 ఏనుగులు 4గుంపులుగా సంచరిస్తున్నాయి.ఇప్పటికే అటవీశాఖ అధికారులు ఏనుగులు పంట పొలాలపై దాడులు చేపట్టకుండా పలు చర్యలు తీసుకునప్పటికి ఫలితం దక్కలేదు.మంగళవారం సుమారు 22 ఏనుగుల గుంపు గుడియాత్తం పలమనేరు జాతీయ రహదారి మొసలమడుగు సమీపంలో ఒక్కసారిగా రావడంతో ప్రయానికులు హడలెత్తిపోయారు.ఓవైపు నుండి మరో వైపు అడవిలోకి వెళ్లడానికి ప్రయత్నించిన ఏనుగులు సోలార్ ఫెన్సింగ్ ఉండడంతో గంటల తరబడి రోడ్డుపై మకాంవేశాయి.ఈ క్రమంలో గంటల తరబడి రోడ్డుపై వాహనాలు స్థంబించడంతో సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు ట్రాకర్ల సహాయంతో ఏనుగుల గుంపును అడవిలోకి మళ్లించారు.రాత్రి సమయాలలో రోడ్లపై ప్రయాణించాలంటే ఏ పక్క నుండి ఏనుగుల గుంపు ఒక్కసారిగా రోడ్లపైకి వస్తుందో అన్న భయంతో ప్రయాణికులు ప్రయాణిస్తున్నారు.

# అమ్మాయిల అక్రమ రవాణాపై ఉక్కుపాదం : డిఐజి

పిచ్చాటూరు(నారాయణవనం), డిసెంబర్ 6 ప్రభాతవార్త :





అమ్మాయిల అక్రమ రవాణా, మైనర్ బాలికలపై అత్యాచారాలపై ఉక్కుపాదం మోపుతున్నట్టు అనంతరం రేంజ్ డిఐజి రవిప్రకాష్ తెలిపారు. మంగళవారం ఉదయం సత్యవేడు నియోజకవర్గం పిచ్చాటూరు పోలీస్‌స్టేషన్ తనిఖీకి వెలుతూ విలేఖరులతో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అమ్మాయిలను అక్రమ రవాణా చేస్తున్నట్టు సమాచారం వుందని, అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. అనంతరం పిచ్చాటూరు పోలీస్‌స్టేషన్‌ని తనిఖీ చేశారు. అలాగే భూ అక్రమాలు జరిగే చర్యలు తప్పన్నారు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం డిఐజిని కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. కేసులను త్వరితగతంగా పరిష్కరించడం, చేధించిన వాటిపై స్పందించి పుత్తూరు రూరల్ సిఐ సురేష్‌కుమార్‌ను, ఎస్‌ఐలను, సిబ్బంది సత్కరించారు.

# ఘనంగా హోంగార్డ్స్ 60వ ఆవిర్భావ దినోత్సవం



తిరుపతి క్రైం, డిసెంబర్ 6, ప్రభాతవార్త
తిరుపతిలోని పోలీస్ ఏఆర్ గ్రౌండ్‌లో హోంగార్డ్స్ 60వ ఆవిర్భవ దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో 820 మంది హోంగార్డ్స్ వివిధ శాఖలలో సేవలందిస్తున్నారని తెలిపారు. కరోనా సమయంలో ఫ్రంట్ లైన్ వారియర్స్‌గా విధులు నిర్వహించాలని తెలిపారు. హోంగార్ల సంక్షేమ కొరకు రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. పోలీసులకు దీటుగా విధి నిర్వహిస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి కులశేఖర్, లక్ష్మీనారాయణ రెడ్డి, డిఎస్పిలు నరసప్ప మురళికృష్ణ, కాటమరాజు, విజయ శేఖర్, ఏఆర్‌డిఎస్‌పిలో సురేందర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రద్దగుంటలో విషాదం

## ప్రమాదవశాత్తు చెరువులో పడి తండ్రీకొడుకు మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు





అలిమిలి చెంగయ్య, నాగార్జున ఫైల్‌పోటోలు

ఓజిలి, డిసెంబర్ 6 ప్రభాతవార్త
ప్రమాదవశాత్తు చెరువులో పడి తండ్రి కొడుకు మృతిచెందిన సంఘటన ఓజిలి మండలం గ్రద్దగుంటలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు ఓజిలి మండలం గ్రద్దగుంట గ్రామానికి చెందిన అలిమిలి చెంగయ్య (62) గేదెలను మేపుకొని జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం గేదెలను మేతకు తీసుకెళ్లి సాయంత్రం వాటిని కడిగేందుకు చెరువులోకి దిగాడు. గేదెలను కడిగే క్రమంలో కాలు జారి చెరువులో పడిపోయాడు. గేదెలు మాత్రం యధావిధిగా ఇంటికి చేరుకున్నాయి. కుటుంబసభ్యులు చెంగయ్య కోసం ఆరా తీయగా సాయంత్రం సమయంలో చెరువులో గేదెలను శుభ్రం చేస్తూ కనిపించాడని పలువురు గొర్రెల కాపరులు తెలిపారు. ఈ నేపథ్యంలో బెంగళూరులో ఉన్న చెంగయ్య కుమారుడు అలిమిలి నాగార్జున (32)కు సమాచారం ఇవ్వడంతో తెల్లవారుజామున స్వగ్రామానికి చేరుకున్నాడు. తన తండ్రిని కాపాడుకుంటానంటూ చెరువులోకి దిగి వెతుకుతున్న క్రమంలో గుంతలో పడి ఊపిరాడక మృతిచెందాడు. సమాచారం అందుకున్న నాయుడుపేట సీఐ వైవీ సోమయ్య, ఓజిలి తహశీల్దార్ డి.లాజరస్, ఓజిలి, దొరవారిసత్రం ఎస్‌ఐలు డి.ఆదిలక్ష్మి, జె.తిరుమలరావు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని ఫైర్‌సిబ్బంది, గజ ఈతగాళ్లు, రెవెన్యూ సిబ్బంది సహకారంతో కలువపూల మధ్యలో ఇరుక్కొని ఉన్న మృతదేహాలను గుర్తించి బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

# కార్తీక లక్ష దీపోత్సవం





వెదురుకుప్పం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడమైదానంలో వేల లక్ష దీపోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి కార్యక్రమం నిర్వహకులు ఎంపిపి బండి నాగరాణి హేమసుందర్ రెడ్డి ఏకవీర సేవ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్‌స్వామీజీని అభినందించారు. పెద్ద సంఖ్యలో హాజరైన మహిళ భక్తులు, దంపతులు తమ వద్దగల దీపాలను వెలిగించి, వెలుగుల కాంతిలో శివపార్వతుల ఆశీస్సులకు ప్రత్యేక నమస్కారాలు చేసుకున్నారు. జడ్పీటిసి సుకుమార్, వైసీపీ మండల అధ్యక్షులు కామసాని పద్మనాభ రెడ్డి, మండల సర్పంచులు సంఘం అధ్యక్షురాలు భారతి, ఎంపిటిసీలు, సర్పంచులు, నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ప్రభాతవార్త, వెదురుకుప్పం

### రాష్ట్రానికి వైకాపా శని ఎప్పుడు పోతుందా అని

# జనం ఎదురుచూపు

### మాజీమంత్రి అమర్నాథ్ రెడ్డి

పెద్దపంజాణి డిసెంబర్ 6 ప్రభాతవార్త :



రాష్ట్రానికి వైకాపా శనిపట్టిందని ఈ శని,ఖర్మ ఎప్పుడు వదులుతుందా అని రాష్ట్రప్రజానీకం ఎదురుచూ స్తున్నారని మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి విమర్శించారు,మంగళవారం చిత్తూరు జిల్లా శంకరాయల పేటలో తెలుగుదేశం పార్టీ చేపట్టిన ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజలు,కార్యకర్తలను ఉద్దే శించి ప్రసంగించారు.సీఎం జగన్ రెడ్డి రాష్ట్రానికి తీరని ద్రోహం చేస్తున్నారని పేర్కొన్నారు.సీఎం జగన్ రెడ్డి,మంత్రి పెద్ది రెడ్డిరామచంద్రా రెడ్డిలు సేద్యం చేసివుంటే వారికి రైతుల కష్టాలు తెలిసేవన్నారు.నాణ్యమైన విధ్యుత్ అందిస్తామని రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగిస్తూ రైతుల మెడలకు ఉరితాడు వేస్తున్నారని పేర్కొన్నారు. కరెంటు చార్జీలు ఐదుసార్లు పెంచారన్నారు.నిత్యావసర సరుకుల ధరలు,ఆర్టీసీ చార్జీలు,పెట్రోల్ డీజల్ ధరలు పెంచారని ఆగ్రహం వ్యక్తం చేసారు. మద్యనిషేదం చేస్తానన్న సీఎం జగన్ క్వార్టరు మందును రూ.200 ధర పెంచి ప్రెసిడెంట్ మెడల్,స్పెషల్ స్టేటస్ వంటి తెలియని బ్రాండలను మద్యం షాపుల్లో విక్రయిస్తున్నారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి వచ్చిన పరిశ్రమల పెట్టుబడి దారులను బెదిరించి తరిమేస్తున్నారన్నారు.రాష్ట్రానికి మూడు రాజధానులంటూ హంగామా చేస్తున్నారని ఇటీవల సుప్రిం కోర్టులో న్యాయమూర్తి హైకోర్టు ఎక్కడుందని ప్రశ్నిస్తే ప్రభుత్వం తరుపున న్యాయవాధి అమరావతిలోనే ఉందని పేర్కొన్నారని కర్నూలులో న్యాయరాజధాని ఏర్పాటు చేస్తామని ఎందుకు పేర్కొనలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షులు ఆనంద్,చలపతి,నాగరాజు రెడ్డి, మురహరి రెడ్డి,సుధాకర్ రెడ్డి,మాజీ ఎంపీపీ మురళీకృష్ణ,కృష్ణారెడ్డి,లింగాపురం సర్పంచ్ రుద్రమూర్తి నాయుడు,ముభారక్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరులో వ్యక్తి హత్య

చిత్తూరు, డిసెంబర్ 6 ప్రభాతవార్త: చిత్తూరు సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలకు సమీపంలో ఓ వ్యక్తి హత్యకు గురైయ్యాడు. చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్ ఆటో స్టాండ్‌లో బాలాజీ నగర్‌కు చెందిన వడివేలు(40) ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో వడివేలు మృతదేహం సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల మొయిన్ గేటు నుండి వంద మీటర్ల దూరంలో కోడిగుట్ట గ్రామంకు పోవుదారిలో మంగళవారం తెల్లవారు జాము స్థానికులకు కన్పించింది. ఎవరినో ఇక్కడికి తీసుకువచ్చి హత్య చేసి వెళ్ళిపోయారని స్థానికులు భావించి సమాచారంను చిత్తూరు తాలుకా స్టేషన్ పోలీసులకు అందజేశారు. ఈ మేరకు రంగంలోకి దిగిన ఎస్‌ఐ రామకృష్ణ సంఘటనా స్థలంచేరుకొని మృతదేహంను పరిశీలించి ఆధారాల కోసం అన్వేషించారు. మృతదేహం చిత్తూరు బాలాజీ నగర్‌కు చెందిన వడివేలుగా గుర్తించి అతని బంధువులకు సమాచారం అందించారు. వడివేలు ఎక్కువగా రాత్రి సమయాల్లో చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్ నుండి ప్రయాణీకులను ఆటోలో తీసుకొని వెళ్తుండేవాడన్నారు. ఈ క్రమంలో వడివేలు కొంత మంది స్నేహితులతో కలిసి కొడిగుట్ట గ్రామంకు వెళ్ళే దారిలో మద్యం సేవించినట్లు తెలుస్తోంది.వారి మధ్య అభిప్రాయ బేధాలు రావడంతో వడివేలును హతమార్చినట్లు తెలుస్తోంది. ఎస్‌ఐ రామకృష్ణ కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

# తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పున:నిర్మాణ పనులు ప్రారంభం





తిరుపతి,డిసెంబర్ 6ప్రభాతవార్త:
రాయలసీమ జిల్లాల్లోనే ఎంతో చరిత్ర ఉన్న తిరుపతి నగరగ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయ పున:నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. గంగమ్మ ఆలయాన్ని పూర్తిస్థాయిలో విస్తరించడంలో భాగంగా నూతన హంగులతో సుమారు 13కోట్ల రూపాయల అంచనాలతో ఆలయాన్ని పున:నిర్మించేందుకు దేవాదాయశాఖ అనుమతితీసుకుని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నేతృత్వంలో ఆలయ పాలకమండలి ఛైర్మన్ కట్టా గోపీయాదవ్, ఇఓ ఎం.మునికృష్ణయ్య ప్రణాళికలు సిద్దం చేశారు. టిటిడి వాటాగా 3.75కోట్లు రూపాయలు నిధులు ,దాతలు, భక్తుల నుంచి 9.25కోట్ల రూపాయలు సమకూర్చారు. ఈ నూతన పనులు ప్రారంభానికి ముందు మంగళవారం ఉదయం ఆలయ పాతనిర్మాణాలను తొలగించేందుకు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. మొదటి విడతగా ఆలయ విమానగోపురం, గర్భాలయం, మండపం తొలగించే పనులు మొదలయ్యాయి. ఈ ఆలయాన్ని పూర్తిగా తొలగించిన తరూవాత ముందుగానే రూపొందించిన ప్రణాళికల మేరకు నూతన ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేపడతారు. 2023 మేనెలలో గంగమ్మ జాతరనాటికి ఆలయాన్ని నిర్మించి జాతర వేడుకలు జరిపే దిశగా పనులు చేపట్టనున్నారు. మంగళవారం ఆలయ పాత నిర్మాణాలు తొలగించే పనులు ఆలయ ఛైర్మన్ గోపీయాదవ్, ఇఓ ఎం.మునికృష్ణయ్య, ధర్మకర్తలు ధనశేఖర్, భారతి, క్రిష్ణమ్మ ,వెంకటేశ్వరరావు ,ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

## డా.బి.ఆర్ అంబేద్కర్‌కు ఘననివాళులు



చిత్తూరురూరల్, డిసెంబరు 6 ప్రభాతవార్త: అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా దళిత ప్రజాసంఘాల జెఏసి సభ్యులు దర్గా సర్కిల్‌లోని డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి గజమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జెఏసి గౌరవ చైర్మెన్ మునస్వామి, డివిఎంసి సభ్యుడు రాజ్‌కుమార్, జెఏసి చైర్మెన్ కొమ్మిట్ట ధనంజయరావు, నాయకులు సి.జిదాస్, మునీశ్వరరావు, రాజబాబు, బాబు, విజయభాస్కర్, మనోహర్, సురేష్, కె.కె రవి, సుధా, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

### తవణంపల్లెలో

తవణంపల్లె, డిసెంబర్ 6 ప్రభాతవార్త:

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 66 వర్ధంతిని మంగళవారం మండల కేంద్రం తవణంపల్లెలో ఘనంగా నిర్వహించారు. మండల దళిత యువజనసేవాసంఘం ఆధ్వర్యంలో స్థానిక మండల కార్యాలయం వద్ద నున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో వైకాపా మండల కన్వీనర్ సిద్దంపల్లె హరిరెడ్డి, నాయకులు గాంధీబాబు, తడకర మధుకుమార్, పరమేశ్వరరెడ్డి, సరకల్లు హరికృష్ణారెడ్డి, సురేష్ బాబురెడ్డి, ఎంఈఓ శంకరయ్య, మండల దళితసంఘం నాయకులు షణ్ముగం, పరదేశి, డేవిడ్, జగన్నాధం, చిట్టిబాబు, చిన్నెయ్యలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా మండల బిఎస్పీ అధ్యక్ష, ప్రధాన కార్యర్శులు చంద్రబాబు, లవకుమార్‌ల ఆధ ర్యంలో అరగొండ కొత్త బస్టాండులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో బిఎస్పీ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి సిద్దయ్యమూర్తి, నాయకులు పట్నం భాస్కర్, ఏకాంబర్, బాబు, ఐకుట్టి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

### ఐరాలలో

ఐరాల, డిసెంబర్ 6 ప్రభాతవార్త: ఐరాలలో వున్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో మండల వైకాపా కన్వీనర్ బుజ్జిరెడ్డి, ఎంపీపీ మోహన్, వైస్ ఎంపీపీ నిత్య సురేష్‌రెడ్డి, ఎంపీటీసీలు రాజేష్‌రెడ్డి, మమత సురేం ద్రయాదవ్, నాయకులు హరీష్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి ధనచంద్రారెడ్డి, ప్రకాష్, మురళి, మండల దళిత నాయకులు సిద్దయ్యమూర్తి, కోదండ, దొరబాబు, వెంకటస్వామి, నటరాజ, అవార్డు రవి, బ్రహ్మతేజ, ధనంజయ తదితరులు పాల్గొన్నారు.

### అగరంపల్లెలో...



కాణిపాకం, డిసెంబర్ 6 ప్రభాతవార్త: రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ వర్ధంతిని కాణిపాకం గ్రామ పంచాయతీ అగరంపల్లె కూడలిలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పీసీసీ డెలిగేట్ సభ్యుడు ఏపీ పరదేశి ఆధ్వర్య ంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో స్థానిక దళితనాయకులు కృష్ణన్, మురుగేష్, పుణ్యసముద్రం మహేష్, మాజీ సర్పంచ్ గోపీనాధన్, తదితరులు పాల్గొన్నారు.

### కుప్పంలో



కుప్పం, డిసెంబర్ 6 ప్రభాతవార్త

దేశంలోని అణగారిన వర్గాల ఆత్మబంధువు రాజ్యాంగ నిర్మాత డా॥ బిఆర్ అంబేద్కర్ అని కుప్పం మున్సిపల్ చైర్మన్ డా॥ సుధీర్ పేర్కొన్నారు. మంగళవారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక బసా ్టండు వద్దగల డా॥ అంబేద్కర్ విగ్రహంకు ఛైర్మన్ పూజలు చేసి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. కార్యక్రమంలో కమీషనర్ రవిరెడ్డి, కౌన్సిలర్లు గణపతి, నాగరాజు, అరవింద్, విజయ్, మోహన్‌రాం, కో ఆప్షన్ సర్దార్, నేతలు ప్రకాష్, రాజ, ఇందు, మంజు, చంద్రశేఖర్, దేవా తదితరులు పాల్గొన్నారు.

### శాంతిపురంలో



శాంతిపురం, డిసెంబర్ 6 ప్రభాతవార్త

రాజ్యాంగ నిర్మాత డా॥ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా నేతలు, అధికారులు ఘన నివాళులు అర్పించారు. స్థానిక మండల సచివాలయం ఎదుట అంబేద్కర్ చిత్రపటానికి పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, ఎంపిడిఓ హేమమాలిని, ఎంఎస్‌పి నేత దేవరాజు, ఇతర దళిత నేతలు పాల్గొన్నారు.

### చౌడేపల్లిలో

చౌడేపల్లి, డిసెంబర్ 6 ప్రభాతవార్త : అంబేద్కర్ భవన్‌లో భవన నిర్మాణకర్త, అధ్యక్షుడు బ్యాంకు రెడ్డెప్ప, బస్టాండులో మాలమహానాడు జిల్లా నాయకుడు శివ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు పరిగింటి మాణిక్యంల ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఎంపిపి గాజుల రామ్మూర్తి, తహశీల్దార్ మాధవరాజు, ఎంపిడిఓ సుధాకర్, ఎస్ఐ రవికుమార్, హెచ్‌డిఎస్ ఛైర్మన్ కళ్యాణభరత్, రాజేంద్ర, హరి బాబు, ఆంజప్ప, నాగరాజు, ఉత్తన్న, కెవిపిఎస్ వాసు, ఐక్యవేదిక, దళితసంఘాలనాయకులు పాల్గొన్నారు.

## గంగవరంలో అంబేద్కర్ వర్ధంతి



గంగవరం, డిసెంబరు 6, ప్రభాతవార్త:

మంగళవారం స్థానిక అంబేద్కర్ భవన్‌లో సర్పంచ్ చంద్రమ్మ అధ్యక్షతన అంబేద్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఎంపిపి నీరుగట్టి వెంకటరమణ, పలమనేరు మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ప్రహ్లాద, సర్పంచుల సంఘం అధ్యక్షుడు గిరిరాజారెడ్డిలు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక కస్తూరిబా పాఠశాలలోని 300 మంది విద్యార్థినులకు ఉచితంగా నోట్‌పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటీసీలు లేఖ్యాబాలు, భారతీమహేష్, శ్రీధర్, బాలక్రిష్ణ, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు విజయ్, కోశాధికారి భాస్కర్, కార్యదర్శి అనిల్, సభ్యులు బద్రి, వెంకటరమణ, పురుషోత్తం, సుమంత్, బాలాజీ, గంగాధర్, శీను, సిఆర్పీలు రాజా, చలపతి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సదుంలో



సదుం, డిసెంబరు 6 ప్రభాతవార్త

మండల పరిధిలోని సదుం వీఆర్ఆర్ కాలనీలో ఉన్న అంబేద్కర్ భవన్‌లో మంగళవారం డాక్టర్ బీఆర్ ౯ అంబేద్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా డప్పు కళాకారుల సంఘం కోశాధికారి మందా సీతాపతి, సదుం, సోమల, పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల నుంచి ఎంపీపీ ఎల్లప్ప, మాజీ ఎంపీపీ వెంకటస్వామి, బీసీ కృష్ణయ్య, రామచంద్రయ్య, వెంకటనాగులు, సురేంద్ర, దాము, రమేష్, విజయ్‌కుమార్, సుధాకర్, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### రామకుప్పంలో

రామకుప్పం, డిసెంబర్ 6 ప్రభాతవార్త

రామకుప్పం శివాజీనగర్‌లో మంగళవారం కొంత ఉద్రిక్తత చోటు చేసుకుంది. రాజ్యాంగ నిర్మాత డా॥ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా దళిత సంఘాల మహిళలు, నేతలు అంబేద ్కర్ విగ్రహంకు పూజలు నిర్వహించేందుకు ప్రయత్నించారు. అక్కడ పోలీసులు అడ్డుకోవడంతో అనంతరం వారు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా పోలీసులు, దళిత నేతలకు మధ ్య తోపులాట జరిగి దళిత నేతలు బైఠాయించారు. తహశీల్దార్ సురేష్‌బాబు అక్కడకు చేరుకుని సమస్య పరిష్కారంకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా రూరల్ సిఐ రియాజ్ అహ్మద్ నేతృత్వంలో ఎస్సైలు అదనపు బలగాలతో ఉద్రిక్తత మరింత నెలకొనకుండా చర్యలు చేపట్టారు.

### పాలసముద్రంలో

పాలసముద్రం, డిసెంబర్ 6 ప్రభాతవార్త: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్. అంబేద్కర్‌ను స్మరించుకోవడం అందరి కర్తవ్యమని తహసిల్దారు బాబు పేర్కొన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని మంగళవారం తహసిల్దారు కార్యాలయంలో తహసిల్దారు బాబు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. రాజ్యాంగంలో సామాన్య ప్రజల కోసం పలు చట్టాలను డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పొందుపరిచారన్నారు. ప్రతి ఒక్కరు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అడుగు జాడల్లో నడచి సమాజంను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ విద్యావతి, డిప్యుటీ తహసిల్దారు మధుబాబు, ఆర్ఐ కిషోర్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## బిసిలకు అండగా నిలిచింది చంద్రబాబే - మాజీ ఎమ్మెల్సీ గౌనివారి



శాంతిపురం, డిసెంబర్ 6 ప్రభాతవార్త

రాష్ట్ర ్టంలోని బిసిలకు అండగా నిలిచింది తెదేపా అధినేత చంద్రబాబునాయుడేనని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిఎం జగన్‌రెడ్డి పాలనలో బిసిలు తమకు ఇదేం ఖర్మరా అనుకుంటున్నారన్నారు. మూడున్నర ఏళ్లలో బిసిలకు ఏం చేశారో చెప్పే ధైర్యం లేదన్నారు. 34వేల కోట్ల బిసి సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించారన్నారు. రానున్న రోజుల్లో బిసిలు వైకాపా ప్రభుత్వంకు గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విశ్వనాథనాయుడు, నేతలు జనార్ధనరెడ్డి, నాగరాజు, గోవిందరాజులు, గోపాల్, చంద్ర, అనసూయ, చంద్రకళ, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## చెత్తనుంచి ఎరువు తయారు చేయాలి

రొంపిచెర్ల, డిసెంబరు 6 ప్రభాతవార్త

మండల పరిదిలోని చెత్త సంపద కేంద్రాల నుంచి ఎరువు తయారు చేయాలని ఎంపీడీఓ రాజేంద్ర అన్నారు. మంగళవారం ఆయన రొంపిచెర్లలోని దంపింగ కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లా డుతూ తడి చెత్త, పొడి చెత్తలనే వేరు చేయాలని సూచించారు. చెత్తను ఎరువుగా తయారు చేసి విక్రయించాలని చెప్పారు. ఎరువు అమ్మగా వచ్చిన డబ్బును పంచాయతీకి జమచేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి నాగరాజ సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## నగలు చోరీ కేసులో ముద్దాయి అరెస్ట్

తవణంపల్లె, డిసెంబర్ 6 ప్రభాతవార్త:

ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో దాచి వుంచిన నగలును చోరీ చేసిన సంఘటనలో ముద్దాయిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండుకు తరలించినట్లు స్థానిక ఎస్సై ప్రసాద్ తెలిపారు. మండలంలోని దిగువ తడకర గ్రామానికి చెందిన జె.జయరామ్ అనే వ్యక్తి సోమవారం తన కుమారుడి చికిత్స నిమిత్తం ఇంటికి తాళాలు వేసి కుటుంబంతో సహా చిత్తూరు ప్రభుత్వ అస్పత్రికి వెళ్ళగా రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలో దాచి వుంచిన సుమారు 1.50 లక్షల రూపాయల విలువగల బంగారు నగలును చోరీ చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి చోరీ సంఘటనలో ముద్దా ్యయి అదే గ్రామానికి చెందిన ఎం.ముత్తు(23) అనే వ్యక్తిని మత్యం క్రాస్‌లో మంగళవారం అరెస్ట్ చేసి అతని వద్ద నుండి చోరీకి గురైన నగలును స్వాధీనం చేసుకుని రిమాండుకు తరలించినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

## సచివాలయాల్లో ప్రజా సమస్యలపై తక్షణం స్పందించాలి

**- మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్**



కుప్పంరూరల్, డిసెంబర్ 6 ప్రభాతవార్త

వార్డు సచివాలయాల్లో ప్రజలు అందించే వినతులపై తక్షణం ఉద్యోగులు స్పందించాలని మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్ ఆదేశించారు. మంగళవారం మున్సిపల్ పరిధి 2,3వార్డు సచివాలయాల్లో మున్సిపల్ ఛైర్మన్ డా॥సుధీర్, వైస్ ఛైర్మన్ మునస్వామి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా సచివాలయ రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కమీషనర్ రవిరెడ్డి, కౌన్సిలర్లు గణపతి, నాగరాజు, అరవింద్, విజయ్, మోహన్‌రాం, కో ఆప్షన్ సర్దార్, నేతలు ప్రకాష్, రాజ, ఇందు, మంజు, చంద్రశేఖర్, దేవా తదితరులు పాల్గొన్నారు.

## సిఎం జగన్మోహన్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేస్తే సహించం

**- మున్సిపల్ వైస్ ఛైర్మన్ మునస్వామి**

కుప్పంరూరల్, డిసెంబర్ 6 ప్రభాతవార్త

సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిపై కుప్పంలో తెదేపా నేతలు అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేమని తాము కూడా నోటికి పనిచెబుతామని మున్సిపల్ వైస్ ఛైర్మన్ మునస్వామి పేర్కొన్నారు. మంగళవారం కుప్పంలో దేశం నేతలు సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఏకవచనంతో బోధించడంతో పాటు ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని ఇది మంచి పద్ధతి కాదన్నారు. నోటికొచ్చినట్లు మాట్లాడితే తాము కూడా అంతేస్థాయిలో మాట్లాడతామన్నారు. కుప్పంలో ఈసారి వైకాపాను ఖచ్చితంగా గెలిపించి తీరుతామన్నారు.

## 1వ తేది పెన్షన్లు చెల్లించాలంటూ నిరసన

పలమనేరు, డిసెంబరు 06, ప్రభాతవార్త:

రాష్ట్రంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్లకు ప్రతి నెల 1వ తేదిన పెన్షను చెల్లించాలంటూ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం నిరసన చేపట్టారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన రాష్ట్ర కార్యదర్శి గురురాజారావు పెన్షనర్లనాయకులు అనంతరం స్థానిక ఎస్‌టిఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 1వ తేదిన రావలసిన పెన్షను 6వ తేది కావస్తున్న రాకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వ ప్రవేశ పెట్టిన ఇహెచ్‌ఎస్ పథకం సక్రమంగా అమలుకాక పోవడంతో పెన్షనర్లు లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి మెడికల్ రీయంబర్స్‌మెంట్ పథకం ద్వారా వైద్యము చేయంచుకున్న వారికి లక్షలాది రూపాయలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు క్రిష్ణమూర్తి, గౌస్, వెంకటక్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలతో ప్రభుత్వం చెలగాటమాడుతుంది : టిడిపి

పలమనేరు, డిసెంబరు 06, ప్రభాతవార్త:

ప్రజలతో ప్రభుత్వం చలగాటమాడుతుందని టిడిపి నాయకులు విమర్శించారు. మంగళవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 22వ వార్డులో టిడిపి నాయకులు పర్యటించారు. ఈ మేరకు ప్రజలతో ప్రభుత్వం చలగాటమాడుతు రాష్ట్రాన్ని అందగారంలోకి నెడుతుందని, ప్రజలు ఇప్పటికైన మేలుకోవాలని రానున్న భవిషత్తు మార్పుకోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్బిసి కుట్టీ, గిరిబాబు, సుబ్రమణ్యం గౌడ్, నాగరాజు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అంబేద్కర్‌కు ఘన నివాళి



దొరవారిసత్రం, డిసెంబర్ 6 ప్రభాతవార్త

దొరవారిసత్రం ఆరోగ్యకేంద్రం, తహశీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల్లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. మంగళవారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. జయహో అంబేద్కర్ అంటూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ గోపిరెడ్డి, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కోటలో

కోట, డిసెంబర్ 6 ప్రభాతవార్త

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి ఎంపిడిఓ భవాని నివాళి అర్పించారు. ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగ రచన భారమంతా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తన భుజస్కంధాలపై మోశారన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### అంబేద్కర్ అందరికీ ఆదర్శం : జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రజలందరికీ ఆదర్శమని జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి పనబాక కోటేశ్వరరావు అన్నారు. మంగళవారం అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.అంబరిష్, వెంకయ్య గౌడ్, సీనియర్ బీజేపీ నాయకులు పెల్లేటి గోపాల్‌రెడ్డి, మండల కిసాన్‌మోర్చా అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డి, యువమోర్చా అధ్యక్షుడు నికేష్ సాయి తదితరులు పాల్గొన్నారు.

### నాయుడుపేటలో



నాయుడుపేట, డిసెంబర్ 6 ప్రభాతవార్త

నాయుడుపేట పట్టణంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 66వ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. స్థానిక పాతబస్టాండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహానికి మున్సిపల్ ఛైర్‌పర్సన్ కటకం దీపిక పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండల వైసీపీ అధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ, తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, వైసీపీ నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, గందవల్లి సిద్ధయ్య, కటకం జయరామయ్య, బైనా మల్లికార్జునరెడ్డి, చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

నాయుడుపేట రూరల్, డిసెంబర్ 6 ప్రభాతవార్త

నాయుడుపేట పట్టణంలోని కామ్రేడ్ సుందరరామిరెడ్డి భవన్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 66వ వర్ధంతి నిర్వహించారు. రజక వృత్తిదారుల సంఘం, జానపద కళాకారుల సంఘం జిల్లా నాయకులు దిలీప్, గోపాల్ తదితరులు అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు శివకవి ముకుంద, చాపల వెంకటేశ్వర్లు, రజక వృత్తిదారుల సంఘం నాయకులు రమణయ్య, భాస్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఓజిలిలో



ఓజిలి, డిసెంబర్ 6 ప్రభాతవార్త

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 66వ వర్ధంతి కార్యక్రమం ఓజిలి రెవెన్యూ కార్యాలయంలో నిర్వహిం చారు. మంగళవారం ఓజిలి రెవెన్యూ కార్యాలయంలో తహశీ ల్దార్ డి.లాజరస్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఎపిఎం, రెవెన్యూ శాఖ సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

### బాలాయపల్లిలో

బాలాయపల్లి, డిసెంబరు 6, ప్రభాతవార్త: డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ మహోన్నత వ్యక్తి అని తహసీల్దారు అజ్మతుల్లా ఖాన్ తెలిపారు. బాలాయపల్లి మండల రెవెన్యూ కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన తహసీల్దారు అజ్మతుల్లా ఖాన్, సిబ్బంది అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ వలనే అందరూ హాయిగా ఉన్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## తడలో అంబేద్కర్ వర్ధంతి



తడ, డిసెంబర్ 6 ప్రభాతవార్త

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 66వ వర్ధంతిని తడ మండలంలోని పలుచోట్ల జరుపుకున్నారు. మంగళవారం తడలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లోనూ అంబేద్కర్ చిత్రపటాలకు పూజలు చేశారు. దళితుల అభ్యున్నతికి పాటుపడిన బీమ్‌రావ్ అ ంబేద్కర్‌కు నివాళి అర్పించడంలో చిన్నాపెద్దా తేడాలేకుండా పలు కాలనీల కమిటీల ఆధ్వర్యాన వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించారు.

### సూళ్లూరుపేటలో



సూళ్లూరుపేట, డిసెంబర్ 6 ప్రభాతవార్త

ఏడీపీఎస్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం ఘనంగా నివాళి అర్పించారు. ఏడీపీఎస్ రాష్ట్ర అధ్యక్షులు యరబోతు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రచించి అందించిన రాజ్యాంగాన్ని ప్రభుత్వాలు ఖచ్చితంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుదిరి గోపి, ఆవుల చెంగయ్య, సిహెచ్ మాధవయ్య, డి.లక్ష్మ య్య, ఎ.చంద్ర, శివయ్య, వి.వెంకటరమణయ్య, మనోహర్, తేరే వీరయ్య, ముత్యాలయ్య, రవి, జలాలుద్దిన్, చిరంజీవి, సుబ్రహ్మణ్యం, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

సూళ్లూరుపేట, డిసెంబర్ 6 ప్రభాతవార్త

వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం బంగాళాఖాతంలో ఆగ్నేయంగా అల్పపీడన ద్రోణి ఏర్పడింది. అది తుపానుగా రూపాంతరం చెందుతున్నందున తీవ్రమైన గాలులతో కూడిన భారీవర్షాలు కురిసే అవకా శాలు ఉన్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకొని మత్స్యకారులు సముద్రం, పులికాట్ సరస్సుల్లోకి ఈనెల 10వ తేదీ వరకు వేటకు వెళ్లకూడదని తహశీల్దార్ కె.రవికుమార్ మంగళవారం తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 9849904704కు ఫోన్ చేయవచ్చని తహశీల్దార్ కోరారు.

## తడలో గ్రామ పరిషత్ అభివృద్ధి ప్రణాళిక శిక్షణ

తడ, డిసెంబర్ 6 ప్రభాతవార్త

తడలో మంగళవారం గ్రామ పరిషత్ అభివృద్ధి ప్రణాళిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎంపిపి కొళవి రఘు జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించగా, ఎంపిడిఓ ఏవి మురళీకృష్ణ సిబ్బంది శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ, అంబేద్కర్ ఫొటోలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పలువురు సర్పంచులు, ఎంపిటిసిలతో పాటు డిజిటల్ అసిస్టెంట్స్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఎఎన్ఎంలు, మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. 2023-24 గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక గురించి ఈ కార్యక్రమంలో అధికారులు వివరించారు. వీటికి సంబంధించిన పుస్తకాలను పంపిణీ చేశారు.

## అభివృద్ధి పనులకు ముందస్తు ప్రణాళికలు

వాకాడు, డిసెంబర్ 6, ప్రభాతవార్త

పంచాయితీల ద్వారా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ముందస్తు ప్రణాళికలు తప్పనిసరిగా చేసుకోవాలని వాకాడు సొసైటీ అధ్యక్షులు కొడవలూరు దామోదర్ రెడ్డి అన్నారు. మంగళవారం వాకాడు మండల పరిషత్ స్త్రీ శక్తి భవనంలో పంచాయితీ రాజ్ శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మండల స్థాయి సర్పంచులు, ఎంపిటిసిలకు, అధికారులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా విచ్చేసిన దామోదర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పంచాయితీలు అభివృద్ధి చెందాలనదే గాంధీ కల అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ గోపినాథ్, సర్పంచులు సంఘం అధ్యక్షుడు విజయ్ భాస్కర్ రెడ్డి, హౌసింగ్ ఏఈ వెంకటేశ్వరరావు, సర్పంచులు అనిల్ కుమార్ రెడ్డి, నాగరాజు, పుల్లమ్మ, రమణమ్మ, వెంకటరత్నం, మహేంద్ర, ఎంపిటిసిలు, వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ జాతిపిత మహాత్మ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.

## వైసీపి ప్రభుత్వంలో బీసీలకు అన్యాయం జరుగుతుంది

వెంకటగిరి, డిసెంబరు 6, ప్రభాతవార్త:

వైసీపీ ప్రభుత్వంలో బీసీలకు తీరని అన్యాయం జరుగుతందని టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు శ్రీరామదాసు గంగాధర్ తెలిపారు. ఇదేం కర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా వెంకటగిరి క్రాస్ రోడ్డు వద్ద టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. బీసీ కార్పొరేషన్‌కు నిధులను కూడా ప్రభుత్వం ఇవ్వడంలేదన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాలు వేసి నివాళుల ర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బీరం రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షులు కె.వి.కె.ప్రసాద్‌నాయుడు, రూరల్ మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చంద్రమౌళిరెడ్డి, నాయకులు కోటేశ్వరరెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వండి

**- సీపీఐ ఆధ్వర్యంలో ప్రదర్శన**



తడ, డిసెంబర్ 6 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఇళ్ల నిర్మాణానికి ప్రతి లబ్దిదారుడికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ తడ మండల సమితి ఆధ్వర్యంలో మంగళవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సూళ్లూరుపేట నియోజకవర్గం పార్టీ కార్యదర్శి సి.సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంలో ఒక సెంటు చొప్పున భూమి ఇచ్చి ఒక లక్షా 80 వేల రూపాయలు మంజూరు చేస్తుందని, అయితే ఈ స్థలాల్లో 10 శాతం ఇళ్లు కూడా ఇప్పటికీ పూర్తి చేయలేదని విమర్శించారు. ప్రతి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసి పేదలకు ఉపయోగపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఓ.కుమార్, ఏడుమలైరెడ్డి, రమేష్, పాపాతియమ్మ, లవకుశ తదితరులు పాల్గొన్నారు.

## బిసిలను అణిచి వేస్తున్నారు : లీలావతి

చిల్లకూరు డిసెంబర్ 6 ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 3 సంవత్సరాలు గడుస్తున్నా బిసిలను అణిచి వేయడమే లక్ష్యంగా సిఎం జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని సోమవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి ఆధ్వర్యంలో బిసి నాయకులతో కలిసి తహసిల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక ్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతు బిసిలకు 56 కార్పోరేషన్లు ఏర్పాటు చేసి ఒక్కరూపాయి కూడా ఖర్చు చేయలేదని అన్నారు. విద్యా, ఉద్యోగ, ఉపాధీ రంగాలలో తీవ్రంగా అన్యాయం జరిగిందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో పది శాతం పునరుద్దరణ శాసనసభ్యులో తీర్మానించాలని అన్నారు. సబ్‌ప్లాన్ నిధులు బిసిలకు ఖర్చు చేయాలని అన్నారు. సబ్సిడీలలో 34 శాతం బిసిలకు ఇవ్వాలని అన్నారు. అనంతరం తహసిల్దారు జి స్వర్ణకి వినతి పత్రం సమర్పించారు. ఈకార్యక్రమంలో బిసి నాయకులు మేకల కుమార్, అన్నం మునిశేఖర్‌గౌడ, గుండాల శ్రీనివాసులు, ఉడతా శ్రీనివాసులు, వీరబోయిన సురేంద్ర, చేడిమాల శ్రీనివాసులుఏ తదితరులు పాల్గొన్నారు.

## కోటలో గడప గడపకు మన ప్రభుత్వం



కోట, డిసెంబర్ 6 ప్రభాతవార్త

కోట పట్టణంలో జామాయిల్ సెంటర్, దళితవాద ప్రాంతాల్లో మంగళవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ వెలగపల్లి వరప్రసాదరావు నిర్వహించారు. ఆయన గడప గడపకు తిరుగుతూ ప్రజా సమస్యలు తెలుసుకుంటూ ఆ సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపుతూ అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నల్లపరెడ్డి వినోద్‌కుమార్‌రెడ్డి, మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ నరమాల వెంకట రమణయ్య, వైసీపీ నాయకులు యరటపల్లి మధుసూదన్‌రెడ్డి, సర్పంచ్ వెంకటరమణమ్మ, ఉపసర్పంచ్ భాస్కర్, తహశీల్దార్ పద్మావతి, ఎంపిడిఓ భవాని, హౌసింగ్ ఏఇ పాల్గొన్నారు.

## క్రీడాకారులకు దుస్తులు, నగదు పంపిణీ

నాయుడుపేట, డిసెంబర్ 6 ప్రభాతవార్త

రెజ్లింగ్ క్రీడాకారులకు వైసీపీ నేత కలికి మాధవరెడ్డి రెజ్లింగ్‌కు కావలసిన దుస్తులు, నగదు అందజేశారు. ఈ నెల 4, 5 తేదీలలో జరిగిన 66వ ఏపీ ఎస్‌జీఎఫ్ఐ స్టేట్ లెవల్ రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు రేణిగుంటలో జరిగాయి. ఈ పోటీలలో జడ్పీ బాయిస్ స్కూలు బాల బాలికలు జిల్లా ఛాంపియన్‌షిప్‌గా నిలిచారు. వీరిలో ఆరుగురికి బంగారుపతకం, ఏడుగురికి వెండిపతకాలు, ముగ్గురికి కాంస్య పతకాలు పొందారు. ప్రతిభ చాటిన ఈ క్రీడాకారులకు కలికి మాధవరెడ్డి రెజ్లింగ్‌కు కావలసిన దుస్తులు, నగదును అందజేశారు. ఈకార్యక్రమంలో రెజ్లింగ్ కోచ్ ఉదయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

## సరిహద్దు రైల్వేస్టేషన్లలో తనిఖీలు



తడ, డిసెంబర్ 6 ప్రభాతవార్త

ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లోని తడ, సూళ్లూరుపేట రైల్వేస్టేషన్లలో మంగళవారం రైల్వే పోలీసులు తనిఖీలు నిర్వహించారు. జిఆర్‌పి ఎస్ఐ జి.మాలకొండయ్య ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా రైళ్లలో నేరాలు నివారించడానికి వేలిముద్రలు చెక్‌చేశారు. అనుమానితులను విచారించారు. అత్యాధునిక విధానాలతో రైళ్లు, రైల్వేస్టేషన్లలో నేరాల నియంత్రణకు చర్యలు చేపడుతున్నట్లు ఈ సందర్భంగా రైల్వే పోలీసులు తెలిపారు.

# హోంగార్డుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి:ఎస్పీ



చిత్తూరు, డిసెంబర్ 6 ప్రభాతవార్త: హోంగార్డుల సంక్షేమంపై జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తోందని ఎస్పీ రిశాంత రెడ్డి పేర్కొన్నారు. చిత్తూరు ఏఆర్ పోలీస్ పేరెడ్ గ్రౌండ్స్‌లో మంగళ వారం 60వ హోంగార్డుల ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఎస్పీ రిశాంత్‌రెడ్డి హోంగార్డుల నుండి వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ మన దేశంలో హోంగార్డుల వ్యవస్థ 1946 సంవత్సరంలో ప్రారంభమైం దన్నారు. అనంతరం 1963 సంవత్సరం డిసెంబర్ 6వ తేదీ బాధ్యతాయుత పౌరులు సమాజానికి స్వచ్ఛంధ సేవ అందించడం కోసం పురుదు పోసుకొందన్నారు. హోంగార్డు వ్యవస్థ స్వచ్ఛంధ సేవ ధృక్పధంతో ఏర్పాటు అయ్యిందన్నారు. కమ్యూనిటీ పోలీసింగ్‌లో హోంగార్డు వ్యవస్థ ఒక భాగమని, ప్రజలు పోలీసులకు మధ్య హోంగార్డులు వారధులుగా విధులు నిర్వర్తిస్తారన్నారు. పోలీసులతో పోటీ పడి హోంగార్డులు సేవలు అందిస్తుండటం అభినందనీయ మన్నారు. పోలీసు శాఖ క్రమశిక్షణకు మారుపేరుగా నిలుస్తోందని, నిత్యం క్రమశిక్షణతో విధులు నిర్వర్తించి ప్రజలకు ఉత్తమ సేవలు అందించాలని హోంగార్డులకు ఎస్పీ పిలుపునిచ్చారు. అలాగే హోంగార్డులు అవినీతికి దూరంగా వుండాలన్నారు. చిత్తూరు జిల్లాలో శాంతిభద్రతల కోసం 661 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. అలాగే వీరితో పాటు వివిధ ప్రభుత్వ శాఖల్లో 227 మంది హోంగార్డులు డిప్యుటేషన్లపై విధులు నిర్వహిస్తున్నారన్నారు. హోంగార్డులు పోలీసులతో సమానంగా ట్రాఫిక్ రెగ్యులైజేషన్, శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల అడ్డుకట్టలో పాలు పంచుకొంటు న్నారన్నారు. అలాగే ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో, విఐపిలు, వివిఐపిలు పర్యటనకు వచ్చిన సమయంలో పోలీసులకు హోంగార్డుల సేవలు ఉపయోగకరంగా వున్నాయన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చిత్తూరు జిల్లాలో హోంగార్డు బెనిఫిట్ ఫండ్‌ను ఏర్పాటు చేయడం జరిగిం దన్నారు. ఈ ఫండ్ సహాయంతో హోంగార్డులు ఎవరైనా గాయపడితే రూ.30 వేలు, మృతి చెందితే తక్షణ సహాయంగా రూ.4 లక్షలు, రిటైర్డ్ అయిన సమయంలో రూ.4 లక్షలతో పాటు బహుమతులు అందించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం హోంగార్డు యూనిట్‌లో 40 సంవత్స రాలు పైబడిన వారు 249 మంది వున్నారని, వీరికి త్వరలో మెడికల్ టెస్టులు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో మృతి చెందిన ఇద్దరు హోంగార్డు కుటుంబాలకు ఒక్కొక్క కుటుం బానికి 5 లక్షల రూపాయలు అందించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా హోంగార్డులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి ఎస్పీ రిశాంత్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ అడిషనల్ ఎస్పీ జగదీష్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ జి.నాగేశ్వరరావు, స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ శ్రీనివాసులురెడ్డి, చిత్తూరు నగర డిఎస్పీ శ్రీనివాసమూర్తి, ట్రాఫిక్ డిఎస్పీ తిప్పేస్వామి, దిశ డిఎస్పీ బాబు ప్రసాద్, ఎస్సీ, ఎస్టీ సెల్ డిఎస్పీ విజయ్ రఘువీర్, డిటిసి డిఎస్పీ శ్రావణ్‌కుమార్, వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ నరసింహారాజు, ఆర్ఐలు మధు, నీలకంఠేశ్వరరెడ్డి, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ దేశ ప్రజలకు చిరస్మరణీయుడు



నగరి, డిసెంబరు 6 ప్రభాతవార్త : రాజ్యాంగాన్ని రచించి భారతదేశానికి దిశా, నిర్దేశం చేసిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిరస్మరణీయుడని అంబేద్కర్ సేవా సంఘం నాయకులు అన్నారు. పట్టణంలోని కీళపట్టు దళితవాడలో అంబేద్కర్ 66వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ ఎనలేని సేవ చేశారని కొని యాడారు. అంబేద్కర్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని తెలిపారు. అనంతరం పలువురికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి గోవిందస్వామి, ఇంకా నాయకులు దాసన్ అమృతరాజ్, రమేష్, అల్లిముత్తు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## తిరువన్నామలై దీపోత్సవం



పుత్తూరురూరల్, డిసెంబరు 6 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణం మండల పరిధిలోని పలు శివాల యాల్లో తమిళ కార్తీక మాసం తిరువ న్నామలై దీపోత్సవం సందర్భంగా ఆలయాల్లో భక్తులు తాకిడి అధికమైంది. ఉదయం పట్టణంలోని సదాశివేశ్వర స్వామి రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు తాకిడి అధికమైంది. ఉదయం కార్వేటినగరం రోడ్డులో వెలసిన కామాక్షి దేవికి సదాశివేశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొడగంటి రమేష్‌బాబు ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మండల పరిధిలోని తిరుమలకుప్పం, నేసనూరు, తొరూరు గ్రామాల్లో వెలసిన ఆలయాల్లోని శివాలయాల్లో ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు చేశారు. భక్తులు ఆలయ ఆవరణలో అధిక సంఖ్యలో పాల్గొని మహిళలు పిండి దీపాలు పెట్టి పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీరథ ప్రసాదాలు అందించారు.

## రాజ్యాంగనిర్మాత ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుందాం





తిరుపతి,డిసెంబర్ 6ప్రభాతవార్త: భారత రాజ్యాంగనిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని సమాజహితం కోసం కృషి చేయాలని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మంగళవారం స్థానిక ఆర్టీసి బస్టాండు సమీపంలోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి రాయలసీమ రంగస్థలి కళాసంస్థ ఛైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, నాయకులు అక్కినపల్లి మునికృష్ణయ్యయాదవ్, మైనార్టీ విభాగం, ఏవన్ క్యాటరింగ్ అధినేత మస్తాన్, కవిత, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సుబ్రమణ్యంయాదవ్, చంద్రబాబుయాదవ్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

-టిడిపి నేతలు:

అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి టిడిపినేతలు పూలమాలలు వేసి ఆయన జీవిత విశేషాలను వివరించారు. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ రాజ్యాంగం రచిస్తే , పేదల కోసం టిడిపిని స్వర్గీయ ఎన్టీరామారావు అనేక సంక్షేమపథకాలు అమలుచేశారన్నారు. టిడిపి నాయకులు సుగుణమ్మ, నరసింహయాదవ్, సూరసుధాకర్‌రెడ్డి, పుష్పావతియాదవ్, బుల్లెట్‌రమణ, ఆర్‌సి మునికృష్ణ, శ్రీధర్‌వర్మ, వట్టికుంట శంకరనారాయణ, మహేష్‌యాదవ్, రజినీకాంత్‌నాయుడు, హేమంత్‌రాయల్, బ్యాంకు శాంతమ్మ, కుమారమ్మ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర పతి బయోగ్రఫీ కలంకారి కళాఖండంలో . . .

### కలంకారిలో సరికొత్త ప్రయోగం



శ్రీకాళహస్తి,డిసెంబర్ 6 ప్రభాతవార్త : కలంకారికి వేదికగా ఉన్న పుణ్యక్షేత్రం శ్రీకాళహ స్తిలో కళాకారులు విన్నూత్న ప్రయోగాలు చేస్తున్నారు. ఈ నేపధ్యంలో రెండు రోజుల క్రితం తిరుపతిజిల్లా పర్యటనకు వచ్చిన భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు సంబంధించి కలంకారి కళాకారిణి సాలూరు పద్మావతి సరికొత్త ప్రయోగాన్ని చేసారు. రాష్ట్రపతి బయోగ్రపీని ఒకలంకారి కళాఖండంలో రూపొం దించారు. రామాయణ, మహా భారతాలను తెలుగులో లిఖించిన కళాకారులు మొదటి సారి భారత రాష్ట్రపతి ముర్ము జీవిత విశేషాలను ఆంగ్లంలో కలంకారి కళాఖండంలో పొందు పరచారు.ఈ కళాఖండాన్ని పద్మావతి వారి సహచరులు తిరుపతి పద్మావతి మహిళా యూనివర్సిటిలో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో రాష్ట్ర పతికి అందించారు.

**స్పందించిన రాష్ట్రపతి:**

శ్రీకాళహస్తి కలంకారికి సంబంధించిన కళాఖండాన్ని ఆంగ్లంలో చూసిన రాష్ట్రపతి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఆమె రాష్ట్రపతి అయిన తరువాత ఆమెకు అందించిన మహాకానుక కలంకారి కళాఖండంలో ఆమె బయోగ్రఫీ. ఇందులో ఆమె బాల్యం, విద్యాభ్యాసం,రాజకీయ ప్రవేశం నుంచి అంచెలంచెలుగా ఎదిగిన ఆమె జీవితాంశాలను చక్కగా రూపొందించారు.పద్మావతి తమ ప్రతిభను ప్రదర్శిస్తూ 'కంచిపట్టు చీర ఆరున్నర మీటర్ల'మీద పల్లు, జాకెట్ అర్థమీటర్‌లో ముర్ముజీవితాన్ని ఆవిష్కరించారు. పద్మావతి రాష్ట్రపతికి వివరించినపుడు ఆమె 'మహిళలకు సంబంధించి ప్రోత్సహించారు. మహిళలుఏ రంగంలోనూ తీసి పోరని జవాబుదారితనంకు నిదర్శనం అని వివరించారు.

## జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు దస్కూల్ విద్యార్థులు



శ్రీకాళహస్తి, డిసెంబర్ 6 ప్రభాతవార్త : విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి విలువిద్య(ఆర్చరీ) పోటీల నుంచి జాతీయ స్థాయికి ద స్కూల్ విద్యార్థులు ఎంపికై నట్లు కరస్పాండెంట్ జనార్ధన్‌రావు జె. పవార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అండర్-12 విభాగంలో బాలికల విభాగంలో ఆరో తరగతి చదువు తున్న కె.లోహితారెడ్డి ద్వితీయ స్థానం లోను, బాలుర విభాగంలో ఎస్.పార్థివ్ నాలుగోస్థానంలో గెలుపొందినట్లు తెలిపారు. ఈసందర్భంగా త్వరలో నిర్వహించే జాతీయ స్థాయి ఆర్చరీ పోటీలకు పాల్గొనే అర్హత సాధించారని తెలిపారు. విద్యార్థులతో పాటు వారికి శిక్షణ ఇచ్చిన జిల్లా స్థాయి కోచ్ టి.ధనంజయను ఘనంగా సత్కరించారు. అదే విధంగా శ్రీకాళహస్తిలో విలువిద్యకు గుర్తింపు తీసుకొస్తున్న ఆర్చరీ జిల్లా స్థాయి కార్యదర్శి పి.వి.రమణ, శ్రీకాళహస్తి కోచ్ గణేష్ సేవలను కొనియాడారు. విలువిద్యలో రాణించిన విద్యార్థుల భవిష్యత్తులో విద్య ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం విశాల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కాణిపాకంలో వైభవంగా కృత్తికా నక్షత్ర దీపోత్సవం



కాణిపాకం, డిసెంబర్ 6 ప్రభాతవార్త: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో కృత్తికా నక్షత్ర దీపోత్సవం వేడుకలను మంగళవారం రాత్రి అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. కాణిపాకం దేవస్థానం ప్రధాన ఆలయంతో పాటు పరివార ఆలయమైన శ్రీమరగదాంబిగా సమేత మణికంఠేశ్వ రాలయంలో కృత్తికా నక్షత్ర దీపోత్సవం వేడుకలను నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశుల ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్.బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయంలో ఓంకారం, శివలింగాకారంలో దీపాలు వెలిగించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అలంకరించిన స్వామి,అమ్మవార్లను ప్రత్యేక పల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఈసందర్భంగా భక్తులు నారికేళ, కర్పూర హారతులతో స్వామివారి, అమ్మవార్లకు మొక్కులు తీర్చుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు, స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతిసాగర్‌రెడ్డి, అర్చకులు, వేదపండితులు, ఆలయ ఉభయదారులు, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## భారతదేశ రాజ్యాంగం ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేదు : ఎమ్మెల్యే



వెంకటగిరి, డిసెంబరు 6, ప్రభాతవార్త: డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేదని ఒక భారతదేశంలోనే అన్ని వర్గాల వారికి ఉపయోగపడే విధంగా రాజ్యాంగం ఉందని ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. వెంకటగిరిలోని క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారతదేశంలో అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వలన అణగారిన వర్గాల వారు కూడా ఉన్నత స్థాయికి చేరుకున్నారని తెలిపారు. ఇతర దేశాల్లో ఉన్నత స్థాయిలో ఉన్న వారు ఉన్నతంగా ఉన్నారని అణగారిన వారు ఎప్పటికీ అలాగే ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ నక్క భానుప్రియ, వైస్‌చైర్మన్ బాలయ్య, పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్క వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు మాడ జానకిరామయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, నారి శేఖర్, పూజారి లక్ష్మి, పందిటి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## బబిసిలంతా ఏకమై ప్రభుత్వానికి బుద్ధిచెప్తాం..టిడిపి



శ్రీకాళహస్తి, డిసెంబర్ 6 ప్రభాతవార్త : బిసిలంతా ఏకమై వైకాపా ప్రభుత్వానికి, జగన్‌కు తగిన బుద్ది చెప్తామని తెలుగుదేశంపార్టీనేతలు పిలుపు నిచ్చారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళ వారం బిసి సాధికార కమిటీల ఆధ్వర్యంలో స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద 'ఇదేం ఖర్మ' కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. ఇందులో భాగంగా రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. జగన్ ప్రభుత్వ వ్యతిరేఖ విధానాలకు వ్యతిరేఖంగా నినాదాలు చేశారు. ఈసందర్భంగా పలువురు టిడిపి నేతలు మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 56శాతం పైగా బిసిలకు వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలోరాష్ట్ర కార్యదర్శులు దశరధాచారి, రెడ్డివారిగురవారెడ్డి, రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శి నెమళ్ళూరుసుబ్రమణ్యం(బుజ్జి), రాష్ట్ర గాండ్ల బిసి సాధికారిక సభ్యులు కన్నావరం హరిబాబు, పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల.ఉష, పార్లమెంటు కోశాధికారి కంటారమేష్, పట్టణ ఉపాధ్యక్షుడు పోలూరుశ్రీనివాసులురెడ్డి, చెంచయ్య నాయుడు, ప్రకాష్‌నాయుడు, ప్రసాద్‌నాయుడు గాలిమురళీనాయుడు, శివారెడ్డి, మునెయ్య, యాదగిరి, ఆర్ముగం, రవి, షాకిరాలీ, జిలానీబాష, మోహన్‌ఆచారి, కయ్యూరిదిలీప్, ఎంఎస్‌రెడ్డి, మునిరాజ యాదవ్, దొరబాబు, కోబాకలక్ష్మణ్, రవి, హేమంత్, దేవిమోహన్‌గౌడ్ లు పాల్గొన్నారు.

## సమ సమాజ స్థాపనకు అంబేద్కర్ కృషి



తిరుపతి ప్రెస్‌క్లబ్, డిసెంబర్ 6 ప్రభాతవార్త: సమ సమాజ స్థాపనకు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కృషి చేశారని ఏపీఎస్పీ డీసీఎల్ డైరెక్టర్ వి.వెన్.బాబు అన్నారు. మంగళవారం ఏపీఎస్పీ డీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ అంబేద్కర్ భావితరాలకు ఆదర్శవంతంగా నిలిచారని కొనియాడారు. సమాజంలో శాంతిని నెలకొల్పేందుకు ఆయన ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఈకార్యక్రమంలో సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్లు డీఎస్. వరకుమార్, కె.విజయకుమార్ రెడ్డి, వై.లక్ష్మీనరసయ్య, జాయింట్ సెక్రటరీ ఎ.రాధా జయశ్రీ, జనరల్ మేనేజర్లు ఆదిశేషయ్య, మురళీ, సురేంద్రరావు, రవి, గోపాలకృష్ణ, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు జయరామయ్య, అంజనప్ప, సుబ్రమణ్యం, జనార్త తదితరులు పాల్గొన్నారు.

## కుప్పం రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు

కుప్పం, డిసెంబర్ 6 ప్రభాతవార్త : గుంతకల్ రైల్వే ఎస్పీ చౌడేశ్వరి ఆదేశాల మేరకు తిరుపతి రైల్వే డిఎస్పీ షాను, రేణిగుంట రైల్వే సిఐ దేవేంద్రకుమార్ పర్యవేక్షణలో మంగళవారం కుప్పం రైల్వే పోలీసులు స్థానిక రైల్వేస్టేషన్‌లో విస్తృత తనిఖీలు చేపట్టారు. ప్లాట్‌ఫామ్‌పై ఎలాంటి నేరాలు, దొంగతనాలు జరగకుండా మరియు రైళ్లలో ప్రయాణీకుల వద్ద చోరీలకు పాల్పడే పాతకొత్త నేరస్తుల సమాచారం సేకరించారు. ఇందుకు గాను కొత్త యాప్ ద్వారా వేలిముద్రల మిషన్ సాయంతో పలువురి వేలిముద్రలు సేకరించి తనిఖీ చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

## మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులు పరిశీలించిన కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 6 ప్రభాతవార్త : నగర పాలక సంస్థ పరిధిలోని అక్కారంపల్లి వద్ద, హీరో హోండా షోరూం పక్కన ఏర్పాటు చేస్తున్న మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణ పనులను కమిషనర్ అనుపమ అంజలి పరిశీలించారు. మంగళవారం మధ్యాహ్నం కార్పొరేటర్ ఆదం రాధాకృష్ణ రెడ్డి, అదనపు కమిషనర్ సునీత, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులు పరిశీలించారు. భవన నిర్మాణ వ్యర్థాలను వేసి ముందుగా రోడ్డు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పెండింగ్ ఉన్న వారికి వెంటనే టిడిఆర్ బాండ్లు అందించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ కాలువలు తీసి మురుగునీరు వెళ్లేలా చూడాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు సమన్వయం చేసుకుని రోడ్డు ఏర్పాటు చేసి గ్రావెల్‌తో నింపాలన్నారు. యుద్ధ ప్రాతిపదికను ఒక నెల లోపు రోడ్డు పనులను పూర్తి చేయాలన్నారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈ విజయ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కి ఘన నివాళులు



తిరుపతి క్రైం, డిసెంబర్ 6 ప్రభాతవార్త : తిరుపతి జిల్లా పోలీసు కార్యాలయంలో భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 67వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పి పి. పరమేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలు వేసి ఘనంగా సాయుధ దళాల అడిషనల్ ఎస్పి లక్ష్మి నారాయణ రెడ్డి, పోలీసు అధికారులు నివాళులు అర్పించారు. ఏఆర్ డిఎస్పి నంద కిశోర్, ఆర్ఐలు చంద్రశేఖర్, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్‌కు ఘన నివాళి



పుత్తూరు, డిసెంబరు 6 ప్రభాతవార్త : భారత రాజ్యాంగ్ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 66వ వర్ధంతి సందర్భ ంగా పట్టణంలోని అంబేద్కర్ ట్రస్ట్ భవన్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, విశ్రాంత న్యాయమూర్తి టి.దొరస్వామి మాట్లాడుతూ భారతదేశంలో రాజ్యాంగం అమలులో వున్నంత కాలం దానిని రచించిన అంబేద్కర్ జనం గుండెల్లో జీవించే వుంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కార్య దర్శి అపరంజి, కోశాధికారి కుప్పయ్య, సబ్ రిజిస్ట్రార్ సుబ్రమణ్యం, ఎంఇఓ బాబయ్య, మునిసిపల్ కౌన్సిలర్లు కె.బాలసుబ్రమణ్యం, జాన్ కెనడి, ఇంకా డాక్టర్ రాజేంద్ర, వై.ధనపాల్, కె.గజపతి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా కార్తీక దీపోత్సవం



పాలసముద్రం, డిసెంబర్ 6 ప్రభాతవార్త: పాలసముద్రం పంచాయతీ శ్రీ బొమ్మరాజపురంలో వెలసిన శ్రీ బాల గురునాథేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకొని కార్తీక దీపోత్సవంను ఘనంగా నిర్వహించారు. కార్తీక దీపోత్సవం పురస్కరించుకొని భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల పరిధిలోని భక్తులు శ్రీ బాల గురునాథేశ్వరస్వామి ఆలయంలో కార్తీక దిపోత్సవం కార్యక్రమానికి భారీగా తరలివచ్చారు. ఆలయ నిర్వాహకులు ఆలయంను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

## ఉదయగిరి ఎమ్మెల్యేతో భేటీ అయిన డీఆర్



కోట, డిసెంబర్ 6 ప్రభాతవార్త : ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డిని మంగళవారం వైసీపీ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు, ఉదయగిరి నియోజకవర్గం పరిశీలకులు అయిన కొడవ లూరు ధనంజయరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గతంలో కొడవ లూరు ధనంజయరెడ్డి గూడూరు అసెంబ్లీ నియోజకవర్గానికి పరిశీల కులుగా పనిచేసి గూడూరు నియోజకవర్గంలో 45 వేల ఓట్లు మెజార్టీ ని తీసుకొచ్చారు. పార్టీ అధిష్టానం ఏ కార్యక్రమాన్ని అప్పగిం చినా కొడవలూరు ధనంజయరెడ్డి ఎంతో క్రమశిక్షణతో అంకితభావంతో నిస్వార్థంగా పార్టీకి సేవలందిస్తున్నారు. ఆయన సేవలను పార్టీ అధిష్టానం గుర్తించి ఉదయగిరి నియోజకవర్గానికి పరిశీలకులుగా నియమించారు. ఉదయగిరి నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీని తీసుకొచ్చి రానున్న ఎన్నికల్లో చంద్రశేఖర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని చెప్పారు. అంతకుముందు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

## బిసీ మహాసభకు బస్సులను ప్రారంభించిన ఎమ్మెల్యే

చిత్తూరు, డిసెంబర్ 6 ప్రభాతవార్త: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో బుధవారం జరుగనున్న జయహో బీసీ మహాసభకు చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం నుండి హాజరు బీసీల కోసం ఏర్పాటు చేసిన బస్సులను స్థానిక బిటి కాంపౌండ్ ఆవరణలో మంగళవారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జెండా వూపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పలు పథకాలను అమలు చేస్తున్నారన్నారు. బీసీలు ఆర్థికంగా, రాజకీయంగా ఉన్నత స్థాయికి చేరుకోవడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో విధులు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, డిప్యుటీ మేయర్ ఆర్.చంద్రశేఖర్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాహుల్‌రెడ్డి, టౌన్ బ్యాంకు ఛైర్మన్ రామ్‌గణేష్, వైకాపా నాయకులు భూపేష్, కెపి శ్రీధర్, రాజా, శేఖర్, త్యాగ, జనార్ధన్, రమణ, రెడ్డప్ప, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## దేవరకొండపై కార్తీక దీపోత్సవం

బంగారుపాళ్యం, డిసెంబర్ 6 ప్రభాతవార్త: స్వయంభూ శ్రీ మొగిలీశ్వర ఆలయంకు అనుబంధంగా వున్న దేవరకొండపై మంగళవారం కార్తీక దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. మొగిలిలోని మూల విరాట్ స్వామి అమ్మవార్లకు అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు మొగిలీశ్వరుడిని దర్శించుకొన్నారు. అనంతరం దేవరకొండపై వెలసిన శ్రీజలకంఠేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి దేవరకొండపై కార్తీక దీపంను వెలిగించారు. ఈ దీపోత్సవ ఉత్సవానికి పరిసర గ్రామస్తులతో పాటు పలమనేరు, గుడియాత్తం, చిత్తూరు, పూతలపట్టు తదితర ప్రాంతాల నుండి భారీగా భక్తులు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త విజయకుమార్, ఇఓ మునిరాజులు పాల్గొన్నారు.

## బిసిలను అణచివేసి బి.సి.ల గర్జన చేస్తారా : తెదేపా ఇన్‌చార్జ్

**- కుప్పంలో దేశం శ్రేణుల ర్యాలీ.. ఇదేం ఖర్మ.. బిసిలకు కార్యక్రమం !!**



కుప్పం, డిసెంబర్ 6 ప్రభాతవార్త : రాష్ట్రంలో ఉన్న వెనుకబడిన వర్గాల ను మూడున్నర ఏళ్ల పాలనలో అణచి వేసి నేడు బిసిల గర్జన కార్యక్రమా లను వైకాపా నేతలు నిర్వహించడం దారుణమని తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, చంద్రబాబు కార్య దర్శి మనోహర్ పేర్కొన్నారు. మంగళవారం ఇదేం ఖర్మ..బిసిలకు కార్యక్రమంలో భాగంగా దేశం శ్రేణులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండు వద్ద జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. వైకాపా పాలనలో బిసిలపై దాడులు, అక్రమ కేసులు తప్ప ఒరిగిందేమీలేదన్నారు. కార్పోరేషన్లను నిర్వీర్యం చేశారన్నారు. బిసిల సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించారన్నారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయంలో అధికారికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రా ష్ట్ర నేతలు గోపీనాథ్, శాంతారాం, జిఎం రాజు, కాణిపాకం వెంకటేష్, మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, నేతలు సాంబశివం, డా॥ వెంకటేష్, సత్యేంద్రశేఖర్, మంజునాథ్, బిసి సెల్ అధ్యక్షుడు మురళి, ఈశ్వర్, సంజీవి, సుబ్బు, రవి, సతీష్, వసంతమ్మ, సుగుణమ్మ, యశోదమ్మ, దయాకర్, తిరుమగళ్, ఐటిడిపి నరేష్, కౌన్సిలర్లు సెల్వరాజ్, వేలు, సురేష్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శమూర్తి అంబేద్కర్



బంగారుపాళ్యం, డిసెంబర్ 6 ప్రభాతవార్త: డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అందరికి ఆదర్శమూర్తిగా పేరు గడించా రని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పేర్కొన్నారు. మంగళవారం అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని బంగారు పాళ్యంలో వైకాపా దళిత నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే ఎంఎస్ బాబు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అంబేద్కర్ ఎనలేని కృషి చేశారన్నారు. భారత రాజ్యాంగ నిర్మాతగా ప్రముఖ విద్యావేత్తగా ఆయన పేరు గడించారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా, ఎంపిపి అమరావతమ్మ, జడ్పీటిసీ సోమశేఖర్, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, వైకాపా నాయకులు పాల్గొన్నారు. అలాగే విజయవాడలో జరిగే బీసీ గర్జనకు మండలం నుండి బీసీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్ళారు

## షార్‌లో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ప్రదర్శన

శ్రీహరికోట (తడ), డిసెంబర్ 6 ప్రభాతవార్త : శ్రీహరికోటలోని సతీష్‌థవన్ అంతరిక్ష కేంద్రం (షార్)లో మంగళవారం సాయంత్రం పలు ఉద్యోగ సంఘాల ఆధ్వర్యాన కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసులురెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. గేట్-2 నుంచి ఫేజ్-1, ఫేజ్-2 కాలనీల దాకా అంబేద్కర్‌కు నివాళి అర్పిస్తూ ప్రదర్శన కొనసాగింది. అంతకుముందు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూజలు చేసి ఘనంగా నివాళి అర్పించారు.

## జగనన్న రాజ్యంతోనే సర్వతోముఖాభివృద్ధి : ఎమ్మెల్యే



శ్రీకాళహస్తి రూరల్,డిసెంబర్ 5 ప్రభాతవార్త : రాష్ట్రంలో జగనన్న రాజ్యంతోనే సర్వతోముఖాభివృద్ధి సాధ్యమౌతుందని శాసనసభ్యుడు బియ్యపు మధు సూధనరెడ్డి అన్నారు.మంగళవారం ఆయన శ్రీకాళ హస్తి మండలంలోని వేడాం సచివాలయ పరిధిలోని చిన్న మిట్టకండ్రిగ, పెద్ద మిట్ట కండ్రిగ,వేడాం బిసి కాలనీ, రామాపురం పరిసరాల్లో విస్తృతంగా పర్యటిం చారు. ప్రభుత్వం ప్రకటించిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాల్లో భాగంగా నియోజకవర్గం లోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ నేపధ్యంలో మంగళవారం గ్రామాల్లోనూ దళిత వాడల్లో విస్తృతంగా పర్యటించారు.ఆయనకు వైకాపా నాయకుడు బాలిరెడ్డి సారధ్యంలో భారీ ఎత్తున స్వాగతం ఏర్పాటు చేసారు. ఇంటింటి వద్ద మహిళలు హారతులిస్తూ స్వాగతం పలికారు. మీ సమస్యలుంటే నా దృష్టికి తీసుకురమ్మని ఎంఎల్ఏ పిలుపు నిస్తూ తన మొబైల్ నెంబర్‌ను అందిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తున్నాయి మాయ గాళ్ళు వస్తారు.

## అమ్మవారి సేవలో ఆర్టీసీ సిఎండి



తిరుచానూరు,డిసెంబర్ 6 ప్రభాతవార్త: తిరుచా నూరు శ్రీ పద్మావతి అమ్మవారని మంగళవారం ఏపిఎస్ఆర్టీసీ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు దర్శించుకున్నారు.వీరికి ఆల య సూపరింటెండెంట్ శేషగిరి,విజిలెన్స్ ఇన్స్‌పెక్టర్ రామ్మోహన్‌లు ఘన స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.దర్శనానంతరం అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందచేశారు.